గురుకులాల్లో నాణ్యమైన విద్య



పొక్లెయిన్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. నందిమేడారం ప్రభుత్వ బాలుర గురుకులం ఆవరణలో పిచ్చిమొక్కల తొలగించే పనిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గురుకులంలో ఆరో తరగతి చదువుతున్న రామయ్యపల్లికి చెందిన విద్యార్థి శశివర్ధన్ తండ్రి భూతగడ్డల సదానందం తన కొత్త పొక్లెయిన్‌తో పాఠశాల ఆవరణను చదును చేస్తుండటంపై ఆయనను విప్ అభినందించారు. ఈ సందర్భంగా పొక్లెయిన్‌ను ప్రారంభించారు. గురుకులంలో చేపట్టాల్సిన పనులను ప్రిన్సిపల్ విద్యాసాగర్ వివరించారు. ప్రభుత్వ విప్‌ను స్థానిక నాయకులు సన్మానించారు. ఏఎంసీ ఛైర్మన్ రూప్లానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణ

గోదావరిఖని, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. రహదారి ప్రమాదాల నివారణపై శుక్రవారం కమిషనరేట్‌లో పోలీసు, రెవెన్యూ, పురపాలక, రవాణా, జాతీయ రహదారి అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్‌లు, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. జంక్షన్‌ల వద్ద పాదచారులు రోడ్డు దాటే విధంగా క్రాసింగ్ లైట్లు, వాహనదారులకు వేగాన్ని సూచించే డిజిటల్ బోర్డులు ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్‌లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, డీసీపీ చేతన, అదనపు డీసీపీ రాజు, రవాణా శాఖ అధికారులు రంగారావు, శ్రీనివాస్, వైద్య, పీఆర్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశంలో పాల్గొన్న సీపీ శ్రీనివాస్

జాగ్రత్తలే శ్రీరామ రక్ష

- పోషకాహారం, పరిశుభ్రతతో ఆరోగ్య రక్షణ
- ఆర్బీఎస్కే పరీక్షల్లో పిల్లల్లో వ్యాధుల గుర్తింపు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్


జీవన శైలిలో మార్పులు, పోషకాహార లోపం, అపరిశుభ్రత తదితర కారణాలతో పిల్లల్లో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 3 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలను రాష్ట్రీయ బాలస్వాస్థ కార్యక్రమం(ఆర్బీఎస్కే)లో పరీక్షించగా వచ్చిన ఫలితాలు ఆలోచింపచేస్తున్నాయి. ఎక్కువ మంది పిల్లలు దంత, చర్మ, కంటి, రక్తహీనత, గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నట్లు తేలింది.



పెద్దపల్లి పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

2,033 మంది బాధితుల గుర్తింపు

జిల్లాలో ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో పది వైద్య బృందాలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాయి. పాఠశాలల్లో ఏటా రెండు సార్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు సార్లు పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో మొత్తం 706 అంగన్‌వాడీ కేంద్రాల్లో 31,707 మందిని పరీక్షించారు. 2,375 మందికి మందులు పంపిణీ చేసి 263 మందిని ఆసుపత్రులకు రెఫర్ చేశారు. 560 పాఠశాలల్లో 39,890 మందికి పరీక్షలు జరిపారు. 4,842 మందికి మందులు అందించి, 1,770 మందిని రెఫర్ చేశారు. జిల్లాలో మొత్తం 2,033 మంది పిల్లల్లో వివిధ వ్యాధులను గుర్తించారు.



రుగ్మతలకు ప్రధాన కారణాలు

- ప్రతి రోజూ స్నానం చేయకపోవడం, ఉతికిన దుస్తులు వేసుకోకపోవడంతో ఎక్కువ మంది పిల్లలు చర్మ సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు.
- జంక్ ఫుడ్, తీపి పదార్థాలు, కేకులు, బర్గర్లు, భోజనం తిన్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోకపోవడంతో దంతాల్లో సూక్ష్మ కణాలు చేరి హాని కలిగిస్తున్నాయి.
- ఎక్కువ సమయం ఫోన్లు, టీవీలు చూస్తుండటంతో కంటి సమస్యలు పెరుగుతున్నాయి.
- కూరగాయలు, పండ్లు తీసుకోకపోవడంతో పౌష్టికాహార లోపం తలెత్తుతోంది. ఫలితంగా శారీరక ఎదుగుదల క్షీణిస్తోంది.

ఆరోగ్యంగా ఉండాలంటే..

- రోజుకు రెండు సార్లు స్నానం చేయడంతో పాటు భోజనానికి ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. ● రాత్రి భోజనం తర్వాత తప్పనిసరిగా దంతాలు శుభ్రం చేసుకోవాలి. ● టీవీలు, ఫోన్లు, కంప్యూటర్లను ఎక్కువ సమయం చూస్తే కళ్లు పొడిబారి చూపు సమస్యలు తలెత్తుతాయి. పుస్తకాలను కంటికి కనీసం 30 సెం.మీ.ల దూరంలో ఉంచి చదివించాలి.

అపరిశుభ్రతే అన్నింటికీ మూలం



పిల్లల్లో అనారోగ్యానికి అపరిశుభ్రతే ప్రధాన కారణం. ఒకరి దుస్తులు మరొకరు ధరిస్తే గజ్జి, తామర వంటి చర్మ వ్యాధులు సోకుతున్నాయి. చెమటతో ఫంగల్ ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. త్వరగా గుర్తించకుంటే పొక్కులు, పుండ్లుగా మారే ప్రమాదం ఉంది. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించాలి.

-డా.లావణ్య, చర్మ వైద్య నిపుణులు, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

పోషకాహారమే కీలకం



పిల్లలు పోషకాహార లోపంతోనే తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు. వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండటం లేదు. నిత్యం కూరగాయలు, పండ్లు, కోడి గుడ్డు ఇవ్వాలి. పిల్లల్లో రెండేళ్ల వయసు నుంచి మెదడు ఎదుగుదల ఉంటుంది. పోషకాలను సమపాళ్లలో అందిస్తే ఆరోగ్యంగా ఎదుగుతారు.

-డా.రవీందర్, పిల్లల వైద్య నిపుణులు, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

ఇళ్ల కేటాయింపునకు అడుగులు..

తుది దశలో ఇందిరమ్మ కమిటీల ఎంపిక

న్యూస్‌టుడే, గోదావరిఖని

ప్రతి పేదవాడికి రెండు పడకగదుల ఇళ్లు కేటాయిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో ప్రకటించారు. దీంతో పేదవారికి ఇళ్లు కేటాయించే దిశగా అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో 3,500 నుంచి 4,000 ఇళ్లను కేటాయిస్తామని మంత్రి ప్రకటించిన నేపథ్యంలో కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగానే ఇందిరమ్మ కమిటీల నియామక ప్రక్రియకు ఆదేశించింది. ప్రస్తుతం కొన్ని చోట్ల నియామక ప్రక్రియ సాగుతుండగా మరి కొన్ని ప్రాంతాల్లో పూర్తి చేశారు. మండలాలకు ఎంపీడీవో, నగరాలు, పురపాలక సంఘాల పరిధిలో కమిషనర్‌లకు కమిటీల నియామకం బాధ్యతలు అప్పగించారు. కమిటీల నియామకం పూర్తి చేసిన అనంతరం వారి ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను కేటాయించనున్నారు.

ప్రక్రియ ఇలా...

పేదలకు ఇళ్ల పంపిణీ కోసం గ్రామాలు, పట్టణాలు, నగరాల వారిగా ఇందిరమ్మ కమిటీలదే కీలక పాత్ర. వారి ద్వారానే ఎంపిక ప్రక్రియ చేపట్టి అర్హులైన వారిని గుర్తించనున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనలో సాగుతున్న పంచాయతీ ప్రత్యేకాధికారి ఛైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కమిటీలో ఇద్దరు స్వయం సహాయక సంఘాల మహిళలు, ఒకరు బీసీ, ఒకరు ఎస్టీ, ఇతరులు ఒకరు ఉంటారు. నగరాలు, పట్టణాల్లో కమిషనర్‌తో పాటు డివిజన్, వార్డు సభ్యుడు, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఒకరు చొప్పున, స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు, ఇతరుల నుంచి ఒకరు సభ్యులుగా నియమిస్తారు. ఆ ప్రాంతం, గ్రామాలకు చెందిన పేద వారిని గుర్తించి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం కమిటీల ప్రక్రియ దాదాపుగా పూర్తి కావడంతో ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు.

ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీలు	
కరీంనగర్	313
పెద్దపల్లి	266
జగిత్యాల	380
సిరిసిల్ల	255

నగరపాలక సంస్థలు	2
పురపాలక సంఘాలు	9

పంపిణీకి కసరత్తు

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను కూడా ఇందులోనే చేర్చి పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పరిశీలించి అర్హులైన పేదవారికి ఇళ్లను పంపిణీ చేసే ప్రయత్నం చేస్తోంది. అయితే దీపావళి వరకు కొంత మందికి పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసింది. ప్రతి నియోజకవర్గానికి సుమారు నాలుగువేల ఇళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో అందుబాటులో ఉన్న ఇళ్లను పంపిణీ చేసిన అనంతరం విడతల వారీగా కేటాయించే అవకాశం ఉంది. వీటితో పాటు సొంతంగా స్థలం ఉన్న పేదలు ఎస్సీ, ఎస్టీలకు రూ. 6లక్షలు, ఇతరులకు రూ. 5 లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి అందించే అవకాశం ఉంది.

15 మంది ఒడిశా కూలీలకు విముక్తి



వెట్టి నుంచి విముక్తి పొందిన ఒడిశా కూలీలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: రాఘవాపూర్‌లోని వీఎస్ఆర్ ఇటుక బట్టీలో నిర్బంధ పనిలో మగ్గుతున్న 15 మంది ఒడిశా కూలీలకు అధికారులు విముక్తి కల్పించారు. ఒడిశాలో ఉన్న కూలీల బంధువులు అక్కడి అధికారులకు ఫిర్యాదు చేయగా ఆ రాష్ట్రంలోని వెట్టిచాకిరీ నిర్మూలన సంస్థ(ఎన్జీవో) నిర్వాహకురాలు ప్రియా అబ్రహం పెద్దపల్లికి వచ్చారు. గురువారం స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి ఇటుక బట్టీకి వెళ్లి కార్మికులను విడిపించారు. అప్పటికే రాత్రి కావడంతో వీరికి పట్టణంలో బస కల్పించి శుక్రవారం రైలులో ఒడిశాకు పంపించారు. అంతకుముందు ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్‌లు కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చాకిరీ నుంచి విముక్తులైన 15 మందిలో ఇద్దరు పిల్లలున్నారు. బట్టీ యజమానిపై ఒడిశాలోని బొలంగీర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ప్రియా అబ్రహం తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)

గోదావరిఖని : 80085 73573

పెద్దపల్లి : 80085 73542

మంథని : 99122 68471

న్యూస్‌టుడే, ఓదెల

? రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసి అడ్డంగా రాళ్లు పెడుతున్నారు. గతంలో పలు ప్రమాదాలు కూడా జరిగాయి. రైతులకు అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టాలి. **-రాజేశం, ఓదెల**

✔ గతంలో పలు గ్రామాల్లో ధాన్యం రహదారులపై ఆరబోయకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించాం. ఈ విషయమై మరోసారి వారికి వివరించి ప్రమాదాల నివారణ చర్యలు చేపడతాం. **-జి.అశోక్‌రెడ్డి, పొత్కపల్లి ఎస్సై**

న్యూస్‌టుడే, కాల్వశ్రీరాంపూర్

? కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం ప్రాథమిక సహకార సంఘం కార్యాలయ సమీపంలోని చేతిపంపు వద్ద ఇంకుడు గుంత నిర్మించారు. వృథా నీరు అందులోకి వెళ్లకుండా పక్కకు పారడంతో పరిసరాలు అపరిశుభ్రమై దుర్గంధం వెదజల్లుతోంది. **-స్థానికులు**

✔ చేతిపంపును పరిశీలించి నీరు ఇంకుడు గుంతలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. **-ఎంపీడీవో రామ్మోహన్‌చారి**

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

? గోదావరిఖని గంగానగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో వీధి దీపం వెలగడం లేదు. **- వెంకటి, గంగానగర్**

✔ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

- రాంజీ, రామగుండం నగరపాలక ఏఈ



వ్యాసరచన పోటీల్లో విశ్వభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు



విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న విశ్వభారతి పాఠశాల కరస్పాండెంట్ యాదగిరిగౌడ్



శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, తదితరులు

విరిసిన ఉత్సాహం.. మెరిసిన ప్రతిభ

గోదావరిఖనిలోని సంజయ్‌గాంధీనగర్‌లో ఉన్న శ్రీచైతన్య ఉన్నత పాఠశాల.. ఎన్టీపీసీ పరిధిలోని అన్నపూర్ణకాలనీలో గల విశ్వభారతి ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8వ, 9వ, 10వ తరగతుల విద్యార్థులకు 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశాలపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు జి.సహస్ర, వెంకట నారాయణ ప్రథమ స్థానంలో.. పి.జయేంద్ర, రోహిఅస్సరా ద్వితీయ స్థానంలో.. ఎస్.రిషికేష్, మేఘనలు తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి ఆయా పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు.

– న్యూస్‌టుడే, జ్యోతినగర్(మార్కండేయకాలనీ)

కోతలు, కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

ఓదెల, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, సుల్తానాబాద్, న్యూస్‌టుడే: తాలు, తరుగు పేరిట కోతలు, మిల్లర్ల కొర్రీలు లేకుండా వానాకాలం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నాలుగు మండలాల్లో సెర్ప్, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఓదెల మండలం కొలనూర్, కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రం, పెగడపల్లి, జూలపల్లి మండలం పెద్దాపూర్, తేలుకుంట, చీమలపేట, నాగులపల్లి, ఎలిగేడు మండలకేంద్రం, ధూళికట్ట గ్రామాల్లో కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. ఎక్కడైనా ధాన్యం తూకంలో కోత విధిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారు. బస్తాకు 41 కిలోలు మాత్రమే తూకం వేయాలని, కొనుగోలు పూర్తయిన వెంటనే రైతులకు ట్రక్ షీట్లు ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం విక్రయించిన రెండు, మూడు రోజుల్లో రైతు ఖాతాలోకి డబ్బులు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కాల్వశ్రీరాంపూర్ మండలం ఆరెపల్లిలో పంచాయతీ కార్యాలయ ప్రహరీ నిర్మాణానికి, శుద్ధ జల కేంద్రానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో సహకార సంఘాల ఛైర్మన్లు ఆళ్ల సుమన్‌రెడ్డి, చదువు రాంచంద్రారెడ్డి, వేణుగోపాల్‌రావు, విజయభాస్కర్‌రెడ్డి, జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గండు సంజీవ్, పార్టీ నేతలు గోపగాని సారయ్యగౌడ్, గాజనవేన సదయ్య, భైరి రవి, డిల్లీ శంకర్, గుండేటి ఐలయ్య, గొప్ప నారాయణరెడ్డి, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పాలకుర్తి: మండలంలోని జయ్యారం, పుట్నూరు గ్రామాల్లో మేడిపల్లి ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కోతలు విధిస్తే సహించేది లేదన్నారు. రైతులకు ఇబ్బందులు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రమేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, మేడిపల్లి, కన్నాల ప్యాక్స్ ఛైర్మన్లు ప్రభాకర్, మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ జ్యోతి పాల్గొన్నారు.



పెగడపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

రికార్డు స్థాయిలో బొగ్గు రవాణా

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఆర్జీ-1 ప్రాంతంలో గురువారం రికార్డు స్థాయిలో బొగ్గు రవాణా జరిగింది. ఒక్క రోజు 24,716 టన్నుల బొగ్గును రవాణా చేశారు. సాధారణంగా రోజు వారి లక్ష్యం 16,500 టన్నులు కాగా గురువారం రెట్టింపు స్థాయిలో రవాణా చేసి రికార్డు నమోదు చేశారు. రోజు వారి ఉత్పత్తి 14,000 టన్నులు కాగా నిల్వ బొగ్గుతో పాటు ఉత్పత్తయిన బొగ్గును వినియోగదారులకు రైలు, రోడ్డు మార్గాల ద్వారా సంస్థ రవాణా చేసింది. రికార్డు స్థాయిలో బొగ్గు రవాణా చేయడంలో సహకరించిన ఉద్యోగులు, అధికారులను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అభినందించారు.



మాజీ రెస్క్యూ సభ్యుల ఆ'పూర్వ' సమ్మేళనం

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సంస్థలో 2003-10 మధ్య కాలంలో విధులు నిర్వహించిన రెస్క్యూ సభ్యులు శుక్రవారం కాలనీలోని రెస్క్యూ స్టేషన్ ఆవరణలో కలుసుకున్నారు. ఉద్యోగ విరమణ పొంది వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన వారు అందరు ఏకమై ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గని కార్మికులుగా పనిచేస్తూనే రెస్క్యూ బ్రిగేడియర్ విభాగంలో పనిచేయడం వల్ల తాము ఇంకా ఆరోగ్యంగా ఉన్నామంటూ పేర్కొన్నారు. అనంతరం రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డిని, సూపరింటెండెంట్ మాధవరావును సన్మానించారు. జక్కిరెడ్డి, సత్యనారాయణ, రామకృష్ణ, సత్యనారాయణరెడ్డి, సత్తయ్య, దుర్గయ్య, నర్సింగరావు, మెహన్‌రావు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ

గోదావరిఖని: స్థానిక క్యాంపు కార్యాలయంలో అంతర్గాం, పాలకుర్తి మండలాలకు చెందిన 90 మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆబ్కారీ సీఐ మంగమ్మ, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



గీత కార్మికుడికి కిట్టు అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

బీసీ కుల గణనపై ప్రజాభిప్రాయ సేకరణ 1న

పెద్దపల్లి కలెక్టరేట్: ఉమ్మడి జిల్లా కేంద్రంలో నవంబరు 1న బీసీ కుల గణనపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. కుల సంఘాలు, మేధావులు హాజరు కావాలని కోరారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే నిర్వహించే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించారు. గోదావరిఖనిలోని జంగ సంజయ్‌కు ఇటీవల ముఖంపై తీవ్రగాయాలు కాగా.. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యులు కంటి కిందనున్న విరిగిన ఎముకకు చికిత్స చేయాలని.. హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. దీంతో ఆయన గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో చేరారు. ముఖంలోని ఎడమ ఆర్బిటల్ ఫ్లోర్, రిమ్, ఎడమ జైకోమటిక్, మెక్సిల్లరీ తదితర ఎముకలకు ఉన్న పగుళ్లకు అత్యంత క్లిష్టమైన ఓఆర్ఐఎఫ్, ఎం.ఎం.ఎఫ్ శస్త్ర చికిత్సలు చేశారు. చికిత్స అనంతరం సంజయ్ కంటిచూపు, చెవి, ముక్కు, గొంతు కదలికలు సక్రమంగానే ఉన్నాయని శస్త్రచికిత్సలో పాల్గొన్న దంత, ఎనస్థీషియా వైద్య బృందం తెలిపింది. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రుల్లో మాత్రమే నిర్వహించే ఇలాంటి శస్త్రచికిత్సను స్థానిక ఆసుపత్రిలో నిర్వహించడం పట్ల సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందుసింగ్ వైద్యులను, సిబ్బందిని అభినందించారు.

ఉపాధిహామీ పనుల గుర్తింపునకు గ్రామసభలు

ఎలిగేడు(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: ఎలిగేడు మండలంలో 2025-26లో చేపట్టే ఉపాధిహామీ పనుల గుర్తింపును గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు శివపల్లిలో, 29 నుంచి 31 వరకు ఎలిగేడులో, నవంబరు 1 నుంచి 4 వరకు ర్యాకల్‌దేవ్‌పల్లిలో, 5 నుంచి 7 వరకు లాలపల్లిలో, 8 నుంచి 11 వరకు రాములపల్లిలో, 12 నుంచి 14 వరకు సుల్తాన్‌పూర్‌లో, 15 నుంచి 18 వరకు ధూళికట్టలో, 19 నుంచి 21 వరకు ముప్పిరితోటలో, 22 నుంచి 24 వరకు బుర్హాన్‌మియాపేటలో, 25 నుంచి 26 వరకు లోకపేటలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. నర్సాపూర్‌లో, నారాయణపల్లి గ్రామాల్లో ఈ నెల 24 వరకు పూర్తయ్యాయన్నారు.

మట్టి రవాణాపై అభ్యంతరం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి నల్లపోచమ్మవాడ, తెనుగువాడ మీదుగా మట్టిని రవాణా చేస్తున్న వాహనాలను శుక్రవారం స్థానికులు అడ్డుకున్నారు. భారీ లోడ్‌తో వెళ్తుండటంతో రోడ్డంతా దుమ్ము లేచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డుపై నీళ్లు కొట్టించిన తర్వాతే వాహనాలను నడిపిస్తామని లారీ యజమానులు చెప్పడంతో కౌన్సిలర్ షాహెదా, నాయకులు సాబీర్‌ఖాన్‌లు స్థానికులతో మాట్లాడి లారీలను పంపించివేశారు.



నిలిచిన లారీలు

విద్యా సంస్థల్లో పీఆర్టీయూ ప్రచారం

కాల్వశ్రీరాంపూర్: ఎమ్మెల్సీ ఉపాధ్యాయ నియోజకవర్గ పీఆర్‌టీయూ అభ్యర్థి మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం కూనారం, మంగపేట, వెన్నంపల్లి, మొట్లపల్లి, మీర్జంపేట, తారుపల్లి, మల్యాల, శ్రీరాంపూర్, కస్తూర్బా, ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ప్రచారం చేశారు. ఉపాధ్యాయులకు ఓటరు నమోదు పత్రాలు అందజేశారు. మండల అధ్యక్షుడు హరికృష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కూరెళ్ల మల్లారెడ్డి, మండల బాధ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జ్యోతినగర్(మార్కండేయకాలనీ), న్యూస్‌టుడే: ఎన్టీపీసీలోని ఆర్ఆర్ గార్డెన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరిపురం వంశీ(27) మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం.. గోదావరిఖనిలోని కాకతీయనగర్‌కు చెందిన వంశీ, తిలక్‌నగర్‌కు చెందిన సాయినితీష్‌లు కలిసి ఎన్టీపీసీ నుంచి గోదావరిఖనికి ద్విచక్రవాహనంపై వెళ్లే క్రమంలో గురువారం రాత్రి అదుపుతప్పి పడిపోయారు. వెనుక కూర్చున్న వంశీకి తలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. సాయినితీష్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ ఎస్సై కె.సతీష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.



వంశీ

నాటుసారా విక్రయదారుల బైండోవర్

ముత్తారం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్న వారిని శుక్రవారం ముత్తారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, ఇప్పలపల్లి, మచ్చుపేట, మైదంబండ, కేశనపల్లి గ్రామాల్లో ఇటీవల దాడులు నిర్వహించి, నాటుసారా విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా ఏడాది కాలానికి రూ.లక్ష పూచీకత్తుతో వదిలేశారు.

మంథనిలో బియ్యం వ్యాపారుల..

మంథని: మంథని మండలంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న అయిదుగురు వ్యాపారులను శుక్రవారం తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. బియ్యం రవాణా చేస్తున్న రాచర్ల రమేష్, వేముల మహేష్, భీమినేని రాజేష్, బుద్దార్థి సమ్మయ్య, కాసు రాజ్‌కుమార్‌లను ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: రామగుండం నగరపాలక ప్రాంతంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్, రామగుండం నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ అరుణశ్రీ ఆదేశించారు. 21వ డివిజన్‌లో రహదారి, మురుగు కాలువ, వంతెన నిర్మాణం పనులను, రైల్వేస్టేషన్ ఎదుట వాణిజ్య భవన నిర్మాణ పనులను, ఎఫ్‌సీఐ అడ్డరోడ్డు నుంచి గౌతమినగర్ వరకు విభాగినిలు, కేంద్రీకృత విద్యుత్తు దీపాల నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. నగరపాలక కార్యదర్శి రాజు, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, డీఈ జమీల్, ఏఈ మీర్, ఆరోగ్య సహాయకులు సునీల్‌రాథోడ్ పాల్గొన్నారు.



విద్యుత్తు దీపాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

2,794 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సరైనవే

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: నిర్ణీత రుసుం చెల్లించి స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్, రామగుండం నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ అరుణశ్రీ కోరారు. ఎల్ఆర్ఎస్‌లో నిర్ణీత రుసుం చెల్లించి స్థలాలను క్రమబద్ధీకరించుకున్నవారికి నగరపాలక కార్యాలయంలో శుక్రవారం ధ్రువీకరణ పత్రాలను ఆమె అందించి మాట్లాడారు. ఎల్ఆర్ఎస్-2020లో లేఔట్ అనుమతి లేని స్థలాల క్రమబద్ధీకరణకు నగరపాలక ప్రాంతంలో 7078 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 2,794 దరఖాస్తులకు నిర్ణీత రుసుం చెల్లించి స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు.

రూ.33.9 లక్షలతో వీధి దీపాలు

నగరపాలక పరిధిలో ఏర్పాటుకు రూ.33.9 లక్షలతో 1,315 వీధి దీపాలను.. రూ.20 లక్షలతో సంబంధిత విడి భాగాలను కొనుగోలు చేసినట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల్లో వీటిని అవసరమైన చోట బిగిస్తామన్నారు. వివిధ కాలనీల్లో 1219 విద్యుత్తు స్తంభాలు అవసరం కాగా ఇప్పటి వరకు 677 వేశామని, మిగిలిన 542 స్తంభాలను నెల రోజుల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వివరించారు. ఆస్తి పన్నులను బకాయిలతో సహా చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. మీ-సేవా కేంద్రాల వద్ద, నగరపాలిక వెబ్‌సైట్‌లో పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. సందేహాలకు 90002 53342 చరవాణి నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఓడేడ్ వంతెనను పరిశీలించిన అధికారులు

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం ఓడేడ్ వద్ద మానేరుపై నిర్మాణంలో ఉన్న వంతెన గతంలో ఈదురుగాలులకు కుప్పకూలిన ఘటనపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కూలిన గడ్డర్‌లను పరిశీలించి, కారణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడ్డర్లను రెండేళ్ల పాటు చెక్కల మీద పెట్టడం వలన ఒకదానిపై మరొకటి పడి గాలికి కింద పడ్డాయని తెలిపారు. పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహించి నాణ్యత లేని గడ్డర్లను తొలగించి కొత్త వాటిని నిర్మిస్తామన్నారు. ఇప్పటికే గుత్తేదారుడిని బ్లాక్ లిస్టులో పెట్టగా కొత్తగా టెండర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు చెప్పారు. వంతెన నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు శామ్యూల్, నరసింహారావు, ఎస్ఈ లక్ష్మణ్, ఈఈ బావుసింగ్, డీఈ జాఫర్, జేఈ హరీశ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సంజాయిషీ నోటీసు

ముత్తారం, న్యూస్‌టుడే: మైదంబండ పంచాయతీ కార్యదర్శి జైపాల్‌కు శుక్రవారం ఎంపీడీవో సురేశ్ సంజాయిషీ నోటీసు జారీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా పంచాయతీ ట్రాక్టర్‌ను పోతారంలోని ఓ వ్యక్తికి లీజుకు ఇచ్చారని, ఆ సమయంలో కార్యదర్శి సెలవులో ఉన్నా ఎలా ఇచ్చారని అందులో ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కేశనపల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. రహదారులపై చెత్త లేకుండా చూడాలని, కాలువల్లో పూడికను తొలగించాలని, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు.

కోతుల బెడద తప్పించడంపై హర్షం

మంథని, న్యూస్‌టుడే: మంథని పట్టణంలో కోతుల బెడద నివారించడాన్ని స్వాగతిస్తూ స్థానిక పండ్ల వ్యాపారులు శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవిని సన్మానించారు. పట్టణంలో ప్రజల ఇబ్బందులను గుర్తించి నెల్లూరు నుంచి కోతులు పట్టేవారిని పిలిపించి కోతులను అడవిలో వదిలిపెట్టారు. కోతులు లేకపోవడంతో ప్రశాంతంగా వ్యాపారం చేసుకుంటున్నామని దుకాణదారులు పేర్కొన్నారు.



ఛైర్‌పర్సన్ రమాదేవిని సన్మానిస్తున్న వ్యాపారులు

రహదారి విస్తరణ పనుల్లో వేగం

గోదావరిఖని, న్యూస్‌టుడే: కార్మికవాడల్లో రహదారి వెడల్పు పనుల్లో భాగంగా ఖని ప్రధాన చౌరస్తా సమీపంలో ఉన్న నివాస గృహాన్ని తొలగించారు. చౌరస్తా నుంచి దుకాణాల సముదాయం వరకు మూడు నివాస గృహాలను తొలగించి రహదారిని విస్తరించాలని ప్రతిపాదనలు చేశారు. అందులో భాగంగా కార్మికులు నివాసం ఉంటున్న రోడ్డువైపు ఉన్న మూడు నివాస గృహాలను ఖాళీ చేయించేందుకు నోటీసులు జారీ చేశారు. దీంతో కొంత మంది కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఖాళీ చేసిన నివాస గృహాన్ని సిబ్బంది తొలగించారు.

రీజియన్ స్థాయి సాంస్కృతిక పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో రామగుండం రీజియన్ స్థాయి సాంస్కృతిక పోటీలు జరిగాయి. కార్మికులు పాల్గొని సంగీత వాయిద్యాల్లో వారి ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. జానపద నృత్యం, పాటల పోటీల్లో పోటీ పడ్డారు. ప్రతిభ కనబర్చిన కళాకారులను సింగరేణి స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు అలివేణి-సుధాకరరావు అన్నారు. సెంటినరీకాలనీ సేవా భవన్‌లో టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్స్ తయారీ, బ్యూటీషియన్ తదితర విభాగాల్లో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా సభ్యురాలు విజయలక్ష్మి-వెంకటేశ్వర్లు, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి, సీనియర్ పర్సనల్ అధికారి రాజేశం, సేవా కార్యదర్శి మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సేవా సమితి సమన్వయకర్త రాయమల్లు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న సేవా అధ్యక్షురాలు అలివేణి

నివాస గృహాల్లో సమస్యల పరిష్కారానికి వినతి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: సెంటినరీకాలనీలోని సింగరేణి నివాస గృహాల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పన్నూరు మాజీ సర్పంచి అల్లం పద్మ శుక్రవారం ఆర్జీ-3 జీఎం సుధాకరరావుకు వినతిపత్రం అందజేశారు. క్వార్టర్లలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీళ్లు వస్తుండగా 20 నిమిషాలను మించి రావడం లేదన్నారు. నిత్యం వచ్చేలా చూడాలని, మురుగుకాలువలు సక్రమంగా శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌టీటూ క్వార్టర్లకు రంగులు వేయాలన్నారు.

సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణకు డిమాండ్

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కార్మికులకు రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్(ఆర్‌సీఎఫ్) ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. శుక్రవారం ఆర్జీ-3 పరిధి ఓసీపీ-2లో నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్)లో జరిగిన కుంభకోణంపై సీబీఐతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయికి గురుకుల విద్యార్థులు

మార్కండేయాకాలనీ, న్యూస్‌టుడే: గౌతమినగర్‌లోని రామగుండం మైనార్టీ గురుకుల బాలుర జూనియర్ కళాశాల ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ మీర్జాసిరాజ్‌బేగ్ తెలిపారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో జరిగిన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో ఫుట్‌బాల్‌లో ఎల్.హాతీరం, ఖోఖోలో ఎం.సిద్ధు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, ఇర్షాద్ ఉల్లాఖాన్‌లు అభినందించారు.

వేదసభ పరీక్షల్లో మంథని విద్యార్థులు

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: మంథని గౌతమేశ్వర వేద పాఠశాల విద్యార్థులు ఖమ్మంలో జరుగుతున్న వేద సభకు హాజరయ్యారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయంతో శ్రీ జనార్దనానంద సరస్వతీస్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా వివిధ ప్రాంతాల్లో శ్రీ తెలంగాణ వేద విద్వన్మహా సభలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 23 నుంచి 27 వరకు 24వ వేద విద్వన్మహా సభలు ఖమ్మం శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్నాయి. మంథని విద్యార్థుల వెంట పాఠశాల ఉపాధ్యాయుడు ఒజ్జల గణేష్, దుద్దిళ్ల గణపతి, కొల్లారపు శ్రీనివాస్, టక్కెగారి కిట్టన్న పాల్గొన్నారు.



క్రీడాకారులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మీర్జాసిరాజ్‌బేగ్, అధ్యాపకులు

సంక్షిప్తం

■ తహసీల్దార్ కార్యాలయం సందర్శన

రామగుండం, న్యూస్‌టుడే: రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సందర్శించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిశీలించారు. మీ-సేవా ద్వారా వచ్చే వివిధ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

■ బాధిత కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి, న్యూస్‌టుడే: పుట్నూరుకు చెందిన వర్మని వెంకటనర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ శుక్రవారం పరామర్శించారు. ఆయన సతీమణి మనాలీ ఠాకూర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు బక్కరాజంపల్లి గ్రామంలో స్థానికులతో ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

■ మంత్రిపై అసత్యపు ఆరోపణలు సరికాదు

పాలకుర్తి, న్యూస్‌టుడే: మంత్రి శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే, భారాస నాయకుడు పుట్ట మధూకర్ అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య అన్నారు. శుక్రవారం బసంత్‌నగర్‌లో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని నియోజకవర్గ అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు శంకర్ నాయక్, లాల్‌సింగ్, కుమార్‌గౌడ్, శ్రీకాంత్, మహేందర్, నర్సయ్య పాల్గొన్నారు.

■ పిల్లలకు దుస్తుల పంపిణీ

రామగుండం, న్యూస్‌టుడే: పట్టణంలోని తబిత అనాథ ఆశ్రమంలో గోదావరిఖని స్ఫూర్తి లయన్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యుడు రంగారావు పిల్లలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి ప్రవీణ్, జయప్రకాశ్, నరేష్, రంగారావు, అజీమ్ పాల్గొన్నారు.

■ సభ్యత్వ నమోదు పెంచాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వాలను పెంచాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సురేశ్‌రెడ్డి సూచించారు. గోదావరిఖనిలోని భాజపా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా నాయకులు పోచం, సంధ్యారాణి, వెంకటరమణ, రమేశ్, నవీన్, రామన్న, లక్ష్మినర్సయ్య, లక్ష్మణ్‌యాదవ్, రాజ్‌కుమార్, పవన్, సాగర్ పాల్గొన్నారు.

■ గీతకార్మికుడికి ఆర్థిక సాయం

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్‌కు చెందిన గీత కార్మికుడు గర్రెపల్లి వెంకటేశ్‌గౌడ్ ఇటీవల ఈత చెట్టు పై నుంచి పడి గాయపడగా శస్త్రచికిత్స జరిగింది. సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బోనాల వెంకటస్వామి, అధ్యక్షుడు బోనాల మల్లయ్య ఆదేశాల మేరకు శుక్రవారం సభ్యులు ఆసుపత్రికి వెళ్లి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. అరవింద్, నగేశ్, తిరుపతి, రాయమల్లు పాల్గొన్నారు.

■ 3న మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం

జూలపల్లి, న్యూస్‌టుడే: నవంబరు 3న పెద్దపల్లిలోని బందంపల్లిలో నిర్వహించే మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం పోస్టర్లను శుక్రవారం జూలపల్లిలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. బండి సంజీవ్, మహేందర్, కొప్పుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

■ మత్స్య సహకార సంఘం కార్యవర్గ ఎన్నిక

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం-మంగపేట మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా పెండం రాజేశం, ఉపాధ్యక్షుడిగా జంగిటి కొమురయ్య, కార్యదర్శిగా జంగిటి సదానందం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పల్కల సురేందర్‌రెడ్డి ప్రకటించారు. డైరెక్టర్లుగా ఎలవేణి స్వామి, కంకణాల నర్సయ్య, జంగిటి సదయ్య, పిట్టల సదానందం, ముడుసు రాజు, సుంచు రమేశ్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం గ్రామస్థులు కార్యవర్గాన్ని సత్కరించారు.

■ రామగుండం ఠాణా తనిఖీ

పాలకుర్తి(రామగుండం), న్యూస్‌టుడే: రామగుండం పట్టణ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ను గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించిన అనంతరం తగు సూచనలు చేశారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

■ 4న మీసేవ నిర్వాహకుల సమావేశం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: మీసేవ నిర్వాహకుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 4న హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశం ప్రచార పోస్టర్‌ను శుక్రవారం పెద్దపల్లిలో ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి నగునూరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్, నాయకులు సొల్లూరి రాజేందర్, తిరుపతి పాల్గొన్నారు.

■ అయోడిన్ లోప రుగ్మతల నివారణపై అవగాహన

జూలపల్లి: ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జూలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, తేలుకుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అవగాహన కల్పించారు. శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను అధిగమించడానికి అయోడిన్ కలిగిన ఉప్పును తీసుకోవాలని ఆయన సూచించారు. ఎస్‌వో శ్రీలత, వైద్య సిబ్బంది ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

■ చందనాపూర్‌లో ఉపాధిహామీ గ్రామసభ

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: చందనాపూర్‌లో శుక్రవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించినట్లు ఎంపీడీవో శైలజరాణి తెలిపారు. 2025-26 సంవత్సరానికి చేపట్టాల్సిన పనులను గుర్తించామన్నారు. ఈసీ లక్ష్మణ్, టీఏ అఖిల, కార్యదర్శి పాల్గొన్నారు.

నేటి నుంచి దీపావళి ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ఇందులో రెండు ఉమ్మడి జిల్లావాసులకు అందుబాటులో ఉన్నాయి. సికింద్రాబాద్-పట్నా ప్రత్యేక రైలు శనివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి ఆదివారం రాత్రి 7 గంటకు పట్నా చేరుకుంటుంది. తిరిగి ఆదివారం రాత్రి 9.20కి పట్నాలో బయల్దేరి మంగళవారం ఉదయం 8.30కి సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. ఇదే రైలు తిరిగి నవంబరు 2, 9 తేదీల్లో పట్నా వైపు, 4, 11 తేదీల్లో సికింద్రాబాద్ వైపు నడుస్తుంది. మరో ప్రత్యేక రైలు మౌలాలిలో ఈ నెల 28న సాయంత్రం 4.45కి బయల్దేరి 30న తెల్లవారుజామున 2.30కి యూపీలోని ముజఫర్‌పూర్‌కు చేరుతుంది. అదే రోజు ఉదయం 4.50కి అక్కడి నుంచి బయల్దేరి 31న రాత్రి 7 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు నవంబరు 4, 11 తేదీల్లో ముజఫర్‌పూర్ వైపు, 6, 13 తేదీల్లో లింగంపల్లి వైపు నడుస్తుంది. ఈ రెండు ప్రత్యేక రైళ్లకు పెద్దపల్లి, రామగుండంలలో హాల్టింగ్ ఇచ్చారు.

5 నుంచి బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో జరిగే బీఈడీ రెండో సెమిస్టర్ (సీబీసీఎస్-రెగ్యులర్, బ్యాక్‌లాగ్) పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా. శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కెట్‌కు 164 ట్రాలీల విడిపత్తి

జమ్మికుంట : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం 164 ట్రాలీల విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో విడిపత్తి క్వింటా కనిష్ఠ ధర రూ.6,000, గరిష్ఠ ధర రూ.6,700 పలికింది. 44 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా రూ.5,800 నుంచి రూ.6,400 వరకు వ్యాపారులు ఖరీదు చేశారు.

భద్రత కల్పిస్తూ...
బాధ్యత తెలియజేస్తూ!

- విద్యార్థులు, పౌరులకు అవగాహన
- కొనసాగుతున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



బాంబును నిర్వీర్యం ఎలా చేస్తారో వివరిస్తున్న నిపుణులు

న్యూస్‌టుడే, కరీంనగర్ నేరవార్తలు

దేశం కోసం ప్రాణాలర్పించిన త్రివిధ దళాల సైనికులు, రాష్ట్ర పోలీసులను స్మరిస్తూ.. ఏటా అక్టోబరు 21న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. అమరులైన వారి సేవలను ప్రతి ఒక్కరికి గుర్తుండేలా వివిధ అంశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే.. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు వివిధ సేవలపై వివరిస్తున్నారు.

ఆయుధాల ప్రదర్శన.. జాగిలాల విన్యాసం

- కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరేడ్ మైదానంలో ఓపెన్ హౌజ్ ఏర్పాటు చేశారు. ఇందులో పోలీసు వినియోగిస్తున్న ఆయుధాలను ప్రదర్శించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఏ ఆయుధాన్ని ఎలాంటి సందర్భాల్లో వినియోగిస్తారో వివరిస్తున్నారు. నేరగాళ్లు ఒకరిగా వచ్చినప్పుడు, గుంపులుగా వచ్చినప్పుడు ఎలాంటి ఆయుధాలు వాడుతారో తెలుపుతున్నారు.
- పోలీసు జాగిలాల విన్యాసం అందరిని ఆకట్టుకుంటుంది. బాంబు స్క్వాడ్ నిపుణులు వాటిని గుర్తించే విధానంపై తెలియజేస్తూ.. అత్యవసర సమయంలో ఉపయోగించే గ్యాస్ టియర్, శరీర రక్షణ కవచంపై వివరిస్తున్నారు. అలాగే సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్నారు.
- ప్రస్తుతం మహిళలు, విద్యార్థినులపై. పాఠశాల, కళాశాల తదితర ప్రాంతాల్లో ఘటనలపై షీటీం బృందం లఘు చిత్రం రూపొందించి విద్యార్థుల కోసం ప్రదర్శిస్తోంది. కేసులు నమోదైతే జరిగే పరిణామాలను సైతం వివరిస్తున్నారు.
- రవాణాకు సంబంధించి.. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. ఇందుకోసం పరేడ్ మైదానంలో ట్రాఫిక్ సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెల్మెట్ వినియోగంపై వీడియో రూపంలో వివరిస్తున్నారు. ప్రమాద సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, బీమా, ఆర్‌సీ తదితర వెంట ఉంటే కలిగే ఫలితాలపై తెలియజేస్తున్నారు.

రక్తదానం.. మహాదానం

అత్యవసర పరిస్థితిలో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నారు. సిబ్బందిలో స్ఫూర్తి నింపేందుకు కరీంనగర్ కమిషనర్ అభిషేక్ మహంతి రక్తదానం చేసి అందరిని ప్రోత్సహించారు. సుమారు 200 మంది రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు.

- ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాయామం చేయడం ప్రతి ఒక్కరిలో తగ్గిపోతుంది. 'తమ చేతుల్లోనే ఆరోగ్యం' అనే నినాదంతో పోలీసుశాఖ సైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

వ్యాసరచన, లఘుచిత్రంపై పోటీలు



వారోత్సవాల్లో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు పలు అంశాలపై ఆన్‌లైన్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. పోలీసు సిబ్బంది అత్యవసర సమయంలో చేసిన సాయంపై తీసిన ఫొటోలపై బహుమతులు.. వారి విధి నిర్వహణపై రూపొందించే చిత్రానికి తగిన గుర్తింపు ఇవ్వనున్నారు. వారోత్సవాల చివరి రోజు పోలీస్ కమిషనర్ బహుమతులు అందిస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోటీలకు సైతం ఎంపిక చేయనున్నారు.

వ్యక్తిగత కక్షతోనే హత్య
నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ వెల్లడి

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా గ్రామీణ మండలం జాబితాపూర్‌లో జరిగిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి హత్య కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జాబితాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ తండ్రి లచ్చన్న పెద్ద నాన్న ముత్తయ్య మధ్య భూ వివాదం ఉంది. ముత్తయ్య తరపున అదే గ్రామానికి చెందిన గంగారెడ్డి పెద్ద మనిషిగా ఉండగా వివాదం పరిష్కారం కాలేదు. అంతేగాకుండా 2020లో సంతోష్‌పై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా వచ్చే నెల 25 నుంచి ట్రయల్ ప్రారంభం కానుంది. ఈ కేసులో రాజీకుదిర్చేందుకు సంతోష్ 15 రోజుల కిందట గంగారెడ్డిని సంప్రదించగా అతను అంగీకరించకపోగా దూషించడంతో ఎలాగైనా అతనిని హతమార్చాలని నిర్ణయించుకున్నారు. అద్దెకారు, ఒక కత్తి తెచ్చుకొని ఈనెల 22న ఉదయం 8 గంటలకు గంగారెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనకనుంచి ఢీకొట్టి అదుపుతప్పి కిందపడగానే ఛాతి తదితర ప్రాంతాల్లో కత్తితో పొడిచి హతమార్చాడు. సంఘటనా స్థలంలోనే సెల్‌ఫోన్, కారు వదిలేసి పారిపోగా గంగారెడ్డి భార్య మారు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్పీ వివరించారు. నిందితుడిపై ఇదివరకే జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలో 3, గొల్లపల్లి స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదైందన్నారు. పథకం ప్రకారం హత్యకు పాల్పడ్డట్లు విచారణలో తేలిందని, ఈ కేసులో ఇతరుల ప్రమేయం ఉందనే విషయమై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ..
ఇద్దరి దుర్మరణం



శ్రీనివాస్‌గౌడ్



దగ్గుల స్వామి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన మెట్‌పల్లి మండలంలో శుక్రవారం విషాదం నింపింది. పోలీసులు, గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌కు చెందిన పోతుగంటి శ్రీనివాస్ గౌడ్(45) గ్రామంలో కల్లుగీత వృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రాయికల్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి తన మేనల్లుడు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన ఉట్నూరి నివాస్‌తో కలిసి వెల్లుల్ల మీదుగా స్వగ్రామానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మండలంలోని వెల్లుల్లకు చెందిన దగ్గుల స్వామి(55) కొన్నేళ్లుగా కుటుంబంతో కలిసి మెట్‌పల్లి పట్టణంలో నివాసముంటున్నాడు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి సుమారు మూడేళ్ల కిందట తిరిగొచ్చి స్థానికంగా చేపలు పడుతూ ఉపాధి పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. వెల్లుల్లకు పని నిమిత్తం వచ్చి తల్లి, ఇతర కుటుంబ సభ్యులను కలిసిన అనంతరం ద్విచక్ర వాహనంపై తిరిగి మెట్‌పల్లికి వెళ్తున్నాడు. వెల్లుల్ల శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో శ్రీనివాస్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామికి తీవ్ర గాయాలు కాగా వెంటనే స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. స్వామికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

28న పీఎఫ్ మీ ముంగిట

చైతన్యపురి, న్యూస్‌టుడే : కరీంనగర్ భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈనెల 28న పీఎఫ్ మీ ముంగిట (నిధి ఆప్కే నికత్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ సెల్వత్కర్ తానయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు అవగాహన కల్పించి, భవిష్యనిధి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

జిల్లా	కార్యక్రమం జరిగే ప్రదేశం
కరీంనగర్	తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామం హరిత బయో ప్రొడక్ట్స్ ఇండియా ప్రైవేట్ సంస్థ
పెద్దపల్లి	సుల్తానాబాద్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనం
జగిత్యాల	విద్యానగర్ మెప్మా సమావేశ గది
సిరిసిల్ల	వేములవాడ మున్సిపల్ కార్యాలయం

29న ఎంపిక పోటీలు

కరీంనగర్ క్రీడా విభాగం: కొత్తపల్లి అకాడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాలలో ఈ నెల 29న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్స్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్ తెలిపారు.

గుట్టను తొలిచి.. నిర్మాణంగా మలచి



ఈనాడు, సిరిసిల్ల: జిల్లాలో అదో మారుమూల తండా. చుట్టూ అటవీ ప్రాంతం. నివాస గృహాలకు స్థలాలు తక్కువ. అలాంటిది పంచాయతీ భవన నిర్మాణం కష్టం. దీనికి తండా వాసులంతా ఆలోచనలో పడ్డారు. చివరికి వారు ఉంటున్న గుట్టను తొలిచి రూ.20 లక్షలతో భవనం నిర్మించారు. ఇదే అడ్డబోరు తండా పంచాయతీ. ఇదే కాకుండా క్రీడా మైదానం, సేవాలాల్ ఆలయం నిర్మించేందుకు మరింత స్థలం చదును చేశారు. ఈ పంచాయతీ భవనం మానాలలోని ఏ తండా నుంచి చూసినా ఎత్తులో కనిపిస్తుంది. వీరి ఐకమత్యం చూసి చుట్టుపక్కల వారు ఔరా అంటున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



వినయ్


పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన గుండా వినయ్(25) విద్యుదాఘాతంతో మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న వినయ్ శుక్రవారం గ్రామంలోని ఎమ్మార్‌ఫీ ఇటుక బట్టీలో విద్యుత్తు తీగలు సరి చేయడానికి వెళ్లారు. నిచ్చెనపైకి ఎక్కి పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

ఉడుం పట్టు.. అదిరేట్టు!

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన కుస్తీ వీరులు

న్యూస్‌టుడే, కరీంనగర్ క్రీడా విభాగం

గత అయిదు ఒలింపిక్స్‌లో మన దేశానికి పతకం తెచ్చిన క్రీడల్లో కుస్తీ(రెజ్లింగ్) ఒకటి. ఈ క్రీడలో రాణించాలంటే శరీర బలంతోపాటు గుండె ధైర్యం కూడా ఉండాలి. తక్కువ సమయంలో ప్రత్యర్థిని పట్టుబట్టి పాయింట్లు రాబట్టాలి. 2012లో కరీంనగర్‌కు కుస్తీ కోచ్ రావడం, జాతీయ స్థాయి ప్రమాణాలున్న మ్యాట్ చొప్పదండి మండలం రుక్మాపూర్ క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేయడంతో జిల్లాలో కుస్తీకి ఆదరణ పెరిగింది. 2020 వరకు రాష్ట్ర స్థాయి పోటీల్లో కరీంనగర్ క్రీడాకారులు ఛాంపియన్లుగా నిలిచారు. కోచ్ బదిలీ కావడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ క్రీడకు కొంత ఆదరణ తగ్గినా.. ఆటపై ఉన్న మక్కువతో క్రీడాకారులు మళ్లీ పుంజుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఈనెల 15, 16న జరిగిన పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి అండర్-19 పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులపై 'న్యూస్‌టుడే' కథనం.



రాష్ట్ర స్థాయి అండర్-19 కుస్తీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఏడాది శిక్షణలో రెండు పతకాలు



ఉప్పలయ్య-నాగమణిల కుమారుడు తిప్పర్తి సిద్ధార్థ రుక్మాపూర్ సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాలలో అంతర్జాతీయ స్థాయి మ్యాట్ ఏర్పాటు చేసి.. మెరుగైన శిక్షణ ఇవ్వడంతో ఏడాది నుంచి శిక్షణ పొందుతున్నాడు. 2024లో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో బంగారు పతకం.. రాష్ట్ర స్థాయి పోటీల్లో వెండి పతకం సాధించాడు.

బంగారు పతకమే లక్ష్యం



గుండియా నాయక్-సుశీల దంపతుల కుమారుడు దినేష్ చొప్పదండి మండలం రుక్మాపూర్‌లోని సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాలలో కోచ్ వంశీకృష్ణ సారథ్యంలో ఏడాది నుంచి కుస్తీ సాధన చేస్తున్నాడు. 2023లో రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అండర్-17 పోటీల్లో కాంస్యం, హనుమకొండలో జరిగిన ఎస్జీఎఫ్ పోటీల్లో రజతం, 2024లో హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో కాంస్య పతకాలు సాధించాడు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని దినేష్ చెబుతున్నాడు.

సైన్యంలో చేరాలని..



వ్యవసాయ కుటుంబానికి చెందిన గంగారాం-సావిత్రబాయిల కుమారుడు కె.రాజరత్నం రెండేళ్ల నుంచి కుస్తీలో శిక్షణ పొందుతున్నాడు. 2023లో ఉట్నూర్‌లో.. 2024లో హైదరాబాద్‌లో జరిగిన పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు రజత పతకాలు, ఆదిలాబాద్‌లో జరిగిన సాంఘిక సంక్షేమ సొసైటీ పోటీల్లో రజత పతకం పట్టుకొచ్చాడు. సైన్యంలో చేరి కుస్తీలో అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు రజరత్నం తెలిపాడు.

రవి దహియా స్ఫూర్తితో..



పి.బిక్కుసింగ్, మీరాబాయిల కుమారుడు విజయ్‌కుమార్ 2020 ఒలింపిక్స్‌లో కుస్తీ పోటీల్లో పతకం సాధించిన రవికుమార్ దహియా స్ఫూర్తితో రెండేళ్లుగా సాధన చేస్తున్నాడు. సాధన మొదలుపెట్టిన కొన్ని రోజుల్లోనే పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. 2023 ఆదిలాబాద్‌లో.. 2024 హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు రజత పతకాలు, సాంఘిక సంక్షేమ సంఘం పోటీల్లో రజత పతకం గెలుచుకున్నాడు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డిప్లొమా కోర్సులు

తీరనున్న సిబ్బంది కొరత.. రోగులకు ప్రయోజనం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

తెలంగాణలో కొత్తగా ఏర్పాటు చేసిన 28 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో పారామెడికల్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రెండేసి డిప్లొమా కోర్సుల నిర్వహణకు శాఖాపరమైన అనుమతులు ఇస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలకు ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున రెండు కోర్సుల్లో 60 సీట్లను కేటాయించింది. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలోని వైద్య కళాశాలల్లో మొత్తం 1,680 మంది విద్యార్థులు పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరవచ్చు. ప్రవేశాల ప్రక్రియ కళాశాల ప్రిన్సిపల్‌లు నిర్వహించనుండగా.. తరగతులను ఆయా కళాశాలలకు అనుబంధంగా ఉండే బోధనాసుపత్రుల్లోనే నిర్వహించనున్నారు.

వైద్య కళాశాల	కోర్సులు
కరీంనగర్	అనస్థీషియా టెక్నీషియన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్
జగిత్యాల	డయాలసిస్ టెక్నీషియన్ ఈసీజీ టెక్నీషియన్
రామగుండం	డయాలసిస్ టెక్నీషియన్ ల్యాబ్ టెక్నీషియన్
రాజన్న సిరిసిల్లా	అనస్థీషియా టెక్నీషియన్ ఈసీజీ టెక్నీషియన్

వైద్య సేవల్లో కీలకం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం, అవసరమైన సహాయ సహకారాలు, వైద్య పరీక్షలు నిర్వహించడంలో పారామెడికల్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారు. అనుబంధ ఆస్పత్రుల్లో కూడా సిబ్బంది కొరత తీరనుంది. ప్రజలకు మెరుగైనా వైద్య సేవలు అందనున్నాయి. ల్యాబ్ టెక్నీషియన్, ఈసీజీ, డయాలసిస్, రేడియో థెరపీ, డెంటల్, ఆప్తామాలజీ టెక్నీషియన్ తదితర 21 రకాల పారామెడికల్ కోర్సులను నూతన వైద్య కళశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఔత్సాహిక విద్యార్థులు ఆయా వైద్య కళాశాలల్లో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలి.

అర్హతలు: ఇంటర్మీడియట్ చేసిన వారు అర్హులు. బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. డిప్లొమా ఇన్ రేడియో థెరపీ టెక్నీషియన్ మాత్రం తప్పనిసరిగా బైపీసీ లేదా ఎంపీసీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి.

కోర్సు కాలపరిమితి: రెండు సంవత్సరాలు

ముఖ్యమైనా తేదీలు

అక్టోబర్ 30 : దరఖాస్తుల సమర్పణకు తుది గడువు.

నవంబర్ 13 : సీట్ల కౌన్సెలింగ్.. కేటాయింపునకు..

నవంబర్ 20 : ఎంపికైనా విద్యార్థుల వివరాలను పారామెడికల్ బోర్డునకు సమర్పణకు

నవంబర్ 22 : కోర్సుల్లో చేరిన విద్యార్థుల వివరాలు పారామెడికల్ బోర్డుకు పంపించడానికి

నవంబర్ 25 : తరగతుల ప్రారంభం

ఉద్యోగ, ఉపాధికి భద్రత

పారామెడికల్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి భద్రత ఉంటుంది. అర్హులైన ఔత్సాహికులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత ధ్రువీకరణ పత్రాలతో వైద్య కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలి. సందేహాలకు 93983 08078 నంబర్ ద్వారా చరవాణిలో సంప్రదించాలి.

- డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని



ఇసుక మాయం.. ముళ్ల పొదలు దర్శనం

ఈ చిత్రంలో కనిపిస్తున్న ముళ్ల పొదలు సాక్షాత్తు వేములవాడ మూలవాగులోనివి. గత కొన్ని సంవత్సరాలుగా ఏటా అక్రమార్కులు ఇసుకను పూర్తిగా తోడేయడంతో అడుగులోతులో మట్టి మిగిలింది. దీంతో వేములవాడ మూలవాగులో ఇసుక మాయమై ఇలా ముళ్ల పొదలు పెరిగి దర్శనమిస్తున్నాయి. ఇది ఒకప్పుడు పూర్తిగా ఇసుకతో దర్శనమిచ్చేది. అలాంటిది ప్రస్తుతం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. **- న్యూస్‌టుడే, వేములవాడ**

అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఎంపిక



అన్వేష్

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కరీంనగర్‌కు చెందిన వారాల అన్వేష్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీలో రూపొందించిన సినిమా 'మోనిహార' అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఎంపికైంది. కేంద్ర సమాచార ప్రసారాల శాఖ ఈ విషయాన్ని శుక్రవారం ప్రకటించింది. భారత కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ వేడుక 2024 నవంబరు 20 నుంచి 28 వరకు గోవాలో జరుగుతుంది. విశ్వనాథ్ ఠాగూర్ రాసిన 'మోనిహార' కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. కోల్‌కత్తా సత్యజిత్ రే ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో సినిమాటోగ్రఫీ పూర్తి చేసిన వారాల అన్వేష్ ప్రస్తుతం హైదరాబాద్ సినిమా రంగంలో పని చేస్తున్నారు. గతంలో పలు చిత్రాలకు పని చేసిన ఈయన ఇండో బంగ్లాదేశ్ లఘు చిత్ర ఫెస్టివల్స్ తోపాటు పలు అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో ప్రశంసలు అందుకున్నారు.